క్లుప్తంగా

ఈద్గా స్థలానికి ప్రహరీ ఏర్పాటు చేయండి

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ పరిధిలో ఉన్న ఈద్గా స్థలానికి ప్రహరీ ఏర్పాటు చేయాలని, అలాగే ముస్లింలకు కమ్యూనిటీ హాలు కావాలని మంగళవారం పట్టణ ముస్లింలు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని కలసి విజ్ఞప్తి చేశారు. ఆయన స్పందిస్తూ త్వరలో ప్రహరీ ఏర్పాటుకు, కమ్యూనిటీ హాలు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కల్లూరు రమణారెడ్డి, అంజుమన్ కమిటీ అధ్యక్షులు రాజీవ్‌బాషా, కోఆప్షన్ మెంబర్ అల్లా, పట్టణ ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ సమీపంలో మంగళవారం ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధమైంది. విద్యానగర్‌కు చెందిన కె.వెంకటసుబ్బయ్య తమ పశువుల మేత నిమిత్తం ఇటీవలే రెండు ట్రాక్టర్ల గడ్డి కొనుగోలు చేసి విద్యానగర్‌లో వామి ఏర్పాటు చేసుకున్నాడు. అయితే మంగళవారం ఉదయం గడ్డివామి నుండి మంటలు చెలరేగడం గమనించిన స్థానికులు వెంకటసుబ్బయ్యకు సమాచారం ఇవ్వడంతో ఆయన వెంటనే అక్కడికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చాడు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

ముమ్మరంగా ఓటర్ల జాబితా సర్వే

చాపాడు : మండల వ్యాప్తంగా రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓల ఆధ్వర్యంలో ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. ఓటర్ లిస్టులతో బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి పేర్లు, చిరునామాలు, ఫొటోలు, మృతి చెందిన వారు ఉంటే వివరాలు తెలుసుకొని మార్పులు, చేర్పులు చేశారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలన చేస్తున్నామని తహసీల్దారు సుభానీ తెలిపారు.

నేడు ఉల్లి సాగుపై అవగాహన సదస్సు

దువ్వూరు : మండల పరిధిలోని చిన్నసింగనపల్లె రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఉదయం 10 గంటలకు కేపీ ఉల్లి పంట సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మైదుకూరు ఉద్యానశాఖ అధికారి రామకృష్ణ మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు కేపీ ఉల్లి సాగుపై మెళకువలు, సలహాలు, సూచనలు రైతులకు అందిస్తారని ఆయన పేర్కొన్నారు. ఉల్లి రైతులందరూ ఈ అవగాహన సదస్సులో పాల్గొనాలని కోరారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ రేపు

చాపాడు : స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద గురువారం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఏపీఓ పద్మారాణి తెలిపారు. 2022 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు మండల వ్యాప్తంగా జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ చేపట్టనున్నారు. పనుల్లో ఎలాంటి వ్యత్యాసాలు ఉన్న సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఏపీఓ తెలియజేశారు.

స్మార్ట్‌ఫోన్‌ను మంచి కోసమే ఉపయోగించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్మార్ట్ ఫోన్‌ను మంచి కోసమే ఉపయోగించాలని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా పట్టణ అధ్యక్షుడు హనీఫ్ అన్నారు. మంగళవారం తమ కార్యాలయంలో అనైతిక విలువలకు వ్యతిరేకంగా ఈ ఎథిక్స్ వీక్‌ను నిర్వహిస్తున్నామన్నారు. యువత గంటల కొద్ది స్మార్ట్ ఫోన్‌ను వినియోగించడంతో శారీరక, మానసిక సమస్యల బారిన పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఈ ఎథిక్స్ వీక్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐఓ సభ్యులు ఏజాజ్, ఆదిల్, ముసవ్విర్, జుహైర్, అనస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి పీపీ యూనిట్‌లో తనిఖీలు



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా గణాంక అధికారి రమేష్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలోని పీపీ యూనిట్‌ను జిల్లా గణాంక అధికారి రమేష్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు అయ్యేవారికి డిశ్చార్జి అయ్యేలోపు బర్త్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. జీరో డోస్ టీకాలు తప్పకుండా వెయ్యాలని చెప్పారు. ఈ జేఎస్‌వై, కుటుంబ నియంత్రణ తదితర వాటి గురించి అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు, గైనకాలజిస్టు డాక్టర్ శ్రీవాణి, ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ నజీర్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, నర్సింగ్ సూపరింటెండెంట్ రాణెమ్మ, హెడ్ నర్సులు సుశీలమ్మ, సువర్ణ, డీఈఓలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి రూ.3378 కోట్లు మంజూరు

- అభివృద్ధి చేసి ఉంటే జగన్ పార్టీకి, చేయకుంటే టీడీపీకి ఓటు వేయమని చెప్పు
- మాజీ ఎమ్మెల్యే వరదకు ఎమ్మెల్యే రాచమల్లు సవాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : గడిచిన నాలుగేళ్లలో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం రూ.3378 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. ఇందులో రూ.1354 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా, రూ.1024 కోట్లు అభివృద్ధి కార్యక్రమాలకు, మరో రూ.1000 కోట్లు జగనన్న ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందులో కొన్ని నిధులు కేంద్ర ప్రభుత్వానికి చెందినవి కూడా ఉన్నాయన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ఉంటే జగనన్న ప్రభుత్వానికి ఓటు వేయాలని, లేదంటే టీడీపీకి ఓటు వేయాలని చెప్పే ధైర్యం మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి ఉందా? అని ప్రశ్నించారు. వరద చేసిన విమర్శలపై ఎమ్మెల్యే రాచమల్లు అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను వివరించారు. రద్దయిన అమృత్ నీటి పథకాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉన్నతాధికారుల వెంబడి తిరిగి మంజూరు చేయించానన్నారు. తమ ప్రభుత్వంలో 92 శాతం పనులు పూర్తి చేసి ప్రజలకు నీరు అందించామన్నారు. వరద స్వగ్రామమైన కామనూరు గ్రామ పంచాయతీలో ఇప్పటి వరకు రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు సంక్షేమ పథకాల ద్వారా రూ.8 కోట్లు మంజూరు చేయించామన్నారు. మన బడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా నియోజకవర్గానికి రూ.108,05,11,000 మంజూరైందని ఎమ్మెల్యే వివరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన నిందితులను ఉరితీయాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు : మణిపూర్‌లో మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిని ఉరితీయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, కార్యదర్శి విజయకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి పాతబస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మహిళలపై అత్యాచారాలు జరుగుతుంటే ఏం చేస్తోందని ప్రశ్నించారు. మణిపూర్ ఘటనలను చూసి బీజేపీ నాయకులు తలదించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు చెన్నారెడ్డి, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సాల్‌మోన్, మధు, లక్ష్మయ్య, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ దేశ వ్యాప్తంగా ఆందోళనలో భాగంగా స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో మంగళవారం సీపీఐ ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి అత్యాచారానికి ఒడిగట్టినా ఆ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రధాని మోడీ ఈ ఘటనపై మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు హరి, ఏసోబ్, చంద్రశేఖర్, మచ్చా శ్రీను, మీరావలి, వీరయ్య, ప్రమీల, సుజాత, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల ఆధ్వర్యంలో..

ప్రొద్దుటూరు కల్చరల్ : మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలపై పట్టణంలోని పాత్రికేయులు సోమవారం సాయంత్రం ప్రెస్‌క్లబ్ నుంచి పుట్టపర్తి సర్కిల్ వరకు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్పందించి నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు పోలింగ్ బూత్ కమిటీలపై అవగాహన కార్యక్రమం

ప్రొద్దుటూరు : నియోజవకర్గ పరిధిలోని పోలింగ్ బూత్ కమిటీలపై బుధవారం ఉదయం 10 గంటలకు రాచమల్లు రాజన్న భోజనశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామ, వార్డు నాయకులతోపాటు ముఖ్య నాయకులందరూ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాలి

జమ్మలమడుగు : ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను వైద్యులు బలోపేతం చేయాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వైద్యులు, సూపర్‌వైజర్లతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు అన్ని రకాలైన వైద్యసేవలను అందించాలన్నారు. ఆయా ప్రాంతాలలో ఉన్న గర్భిణుల వివరాలను సేకరించి వారికి ప్రతి నెల వైద్య సదుపాయాలు అందించాలని సూచించారు. ప్రస్తుతం వర్షకాలం వస్తుండటంతో వైద్య సిబ్బంది గ్రామాలలో వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించాలన్నారు. కార్యక్రమంలో వైద్యధికారి శివప్రసాద్‌రెడ్డి, హెల్త్ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ తొలగించాలని నిరసన

ఎర్రగుంట్ల : మా మిద్దెలపైన 33 కేవీ విద్యుత్‌లైన్ ఉందని దాన్ని తొలగించాలని ఎన్ని సార్లు విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపినా ప్రయోజనం లేకపోవడంతో క్రాంతినగర్ కాలనీ వాసుల విద్యార్థులు మంగళవారం మిద్దెలపైన ఉన్న విద్యుత్ లైన్ చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి తెలిపామని ఆయన వెంటనే లైన్ తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించినా ఇంత వరకూ ఆ శాఖ అధికారులు స్పందించలేదన్నారు. గతంలో ఈ లైన్ తగిలి ఓ వ్యక్తి కూడా మృతి చెందాడని, మరో వ్యక్తికి గాయలైనట్లు వారు గుర్తు చేశారు. ఇప్పటికైన అధికారులు స్పందించి లైన్ తొలగించకపోతే కుటుంబాలు రోడ్లపైకి వచ్చిన నిరసన వ్యక్తం చేయాల్సి ఉంటుందన్నారు..

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలలు తిరుగుతూ విద్యార్థి సంఘాల నాయకులు విద్యాసంస్థలను మూసివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 3, 4, 5 తరగతుల విలీనం ఆపాలని, ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని, మధ్యాహ్న భోజనం తిరిగి ప్రారంభించాలని, జీఓ నంబరు 77ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, ఏఐఎస్‌ఎఫ్ సహాయకార్యదర్శి శరత్, రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, విద్యార్థి సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, శంకర్, వినయ్, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలి

జమ్మలమడుగు రూరల్ : బూత్‌లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సర్వే నిర్వహించాలని ఆర్డీఓ జి. శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆర్డీఓ ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో ఓటర్ల లిస్ట్‌పై ఆయన సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. బూత్ లెవల్ అధికారులు తప్పనిసరిగా ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలు తెలుసుకోవాలన్నారు. బూత్ లెవల్ అధికారులతో పాటు ఆయా వార్డుల్లో పార్టీల తరఫున ఒకరు వెళ్లి పరిశీలించవచ్చునన్నారు. సర్వేలో వలంటీర్లు ఉంటే బూత్ లెవల్ అధికారులను వెంటనే సస్పెండ్ చేస్తామన్నారు. ప్రతి మంగళవారం కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



తొట్టిగారిపల్లె పీహెచ్‌సీలో వైద్యసిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ సరస్వతి

బద్వేలు అర్బన్ : సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ పి.సరస్వతి తెలిపారు. మంగళవారం తొట్టిగారిపల్లె ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, కీటకజనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ ప్రబలే అవకాశం ఉందని, ఇందుకు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. దోమలను లార్వాదశలోనే గుర్తించి యాంటీలార్వా విధానాలను పాటించడం ద్వారా దోమల వృద్ధిని నియంత్రించవచ్చని అన్నారు. ముఖ్యంగా దోమల వృద్ధి జరగకుండా ఉండాలంటే ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించాలని కోరారు. డెంగ్యూ, మలేరియా వ్యాధుల నిర్ధారణకు ర్యాపిడ్ డయాగ్నోసిస్ కిట్లను అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. అనుమానం వచ్చిన వెంటనే రోగికి పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేయాలని సూచించారు. అనంతరం ల్యాబ్, ఫార్మసీ గదులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ పి.జోత్స్నస్వర్ణలత, డాక్టర్ వినయ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, ఆరోగ్య విస్తరణాధికారి నిత్యపూజయ్య, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థుల చదువుల కోసం అమ్మ ఒడి పథకం ద్వారా తల్లుల ఖాతాలకు జమ చేస్తున్న పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సునీల్, రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న ప్రభుత్వాన్ని కోరారు. కడపలోని ప్రగతి నర్సింగ్ హోమ్ వద్ద వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 28వ తేదీన బటన్ నొక్కి అమ్మ ఒడి నిధులను విడుదల చేశారన్నారు. అయితే ఇంకా కొంతమంది లబ్ధిదారులకు సొమ్ము ఖాతాలో పడలేదని, వారికి కూడా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు స్వరూప్‌తేజ్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు..



పెద్దచెప్పలిలో కొలువుదీరిన పీర్లు

కమలాపురం : మండల పరిధిలోని పెద్దచెప్పలిలో వెలసిన వెంకయ్య రామయ్య మఠంలో మొహర్రం పండుగను పురస్కరించుకుని మంగళవారం హసేన్, హుసేన్ పీర్లను భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠించారు. కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో పీర్లను ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 27న ఉదయం బండలాగుడు పోటీలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పెద్దచెప్పలి, ఎల్లారెడ్డిపల్లె గ్రామాలలో పీర్ల ఊరేగింపు వైభవంగా నిర్వహిస్తామన్నారు. అలాగే 28న అగ్ని గుండం నిర్వహిస్తామని ప్రజలు విరివిగా పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు.

సింహాద్రిపురం : మండల పరిధిలోని బలపనూరు, లోమడ, గురిజాల తదితర గ్రామాల్లో మొహరం పండుగను పురస్కరించుకుని చావిడిలలో పీర్లు కొలువు దీరాయి. 9 రోజులపాటు భక్తిశ్రద్ధల నడుమ కులమతాలకతీతంగా పూజలు నిర్వహిస్తారు. వచ్చే శుక్రవారం రాత్రి అగ్ని గుండ ప్రవేశ కార్యక్రమం నిర్వహించనున్నారు. శనివారం సాయంత్రం కొలువు తీరిన పీర్లు బావికి చేరుతాయి.

ఎన్‌సీసీ కేడెట్లకు అభినందన

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)కు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంపులో చక్కటి ప్రతిభ కనబరచడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ అభినందించారు. ఈనెల 14 నుంచి 23వ తేదీ వరకు సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంపులో కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు అశోక్, అభిరామ్ పాల్గొని సాయుధ శిక్షణ, గ్రూప్ డిస్కషన్ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వీరిని మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడులు

కడప అగ్రికల్చర్ : ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడులను సాధించడం సాధ్యమని ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ రామక్రిష్ణంరాజు అన్నారు. మంగళవారం కడప ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది అందరూ మాస్టర్ ట్రైనర్ పరిధిలో జరిగే పొలంబడికి హాజరవుతూ పొలం చుట్టూ ఉండే రైతులకు ప్రకృతి వ్యవసాయంలోకి తీసుకొచ్చే విధంగా కార్యచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. అదే విధంగా పురుగు,తెగుళ్లపైన ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతూ రైతులు నష్టపోకుండా కషాయాలు, ద్రావణాలను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రకృతి వ్యవసాయ ఎస్సీ రైతులు జాబితా సిద్ధం చేసి వారికి ఎస్సీ కార్పోరేషన్ నుంచి సీడ్ కిట్స్ అందే విధంగా చూడాలన్నారు. సిబ్బంది వారి వివో పరిధిలోని క్రాపు మోడల్స్‌ని డెవలప్ చేయాలని సూచించారు. అలాగే పంటల నమూనాపైన అవగాహన కల్పించాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. పంటల సాగులో వారికి కావాల్సిన సలహాలు, సూచనలు ఇచ్చి అధిక దిగుబడి వచ్చే విధంగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

డీఈఓ అనుచిత ప్రవర్తనపై విచారణ జరపాలి

కడపవైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి అనుచిత ప్రవర్తనలపై, అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులను డీఈఓ ఉద్దేశపూర్వకంగానే వేధిస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో చర్చించాలన్నారు.

సేవకు సలాం



అన్నీ తానై సేవలందించి..



చిన్నజొన్నవరంలో మహిళకు మాస్కులను పంపిణీ చేస్తున్న వలంటీర్ శరత్‌కుమార్ రెడ్డి

ఈ ఫొటోలో మాస్కులు పంపిణీ చేస్తున్న తిమ్మారెడ్డి శరత్‌కుమార్ రెడ్డి రాజుపాళెం మండలం ఏరువపాళెం పంచాయతీలోని చిన్నజొన్నవరం గ్రామ వలంటీర్. 2020 సంవత్సరంలో కరోనా మహమ్మారి తాండవం చేస్తున్న రోజులవి. అయితే శరత్‌కుమార్ రెడ్డి సేవాదృక్పథంతో ప్రాణాలకు తెగించి తన పరిధిలోని యాభై కుటుంబాలకు అన్నీతానై సేవలందించాడు. కొంతమందికి నిత్యావసర సరుకులు, మందులు, మాస్కులు అందజేయడంతో పాటు ఆరోగ్య సూత్రాలు వివరిస్తూ అండగా నిలిచాడు. హోమ్ క్వారంటైన్‌లోని వృద్ధులకు పింఛన్ డబ్బు అందజేస్తూ భయందోళన అవసరం లేదని మనోధైర్యాన్నిచ్చాడు. బంధువులు, స్నేహితులు కన్నెత్తి చూడని తరుణంలో వలంటీర్ శరత్‌కుమార్‌రెడ్డి చేసిన సేవలను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు.

– రాజుపాళెం

కరోనా సమయంలో సేవ చేశాడు



కోవిడ్ సమయంలో వలంటీర్ శరత్‌కుమార్ రెడ్డి చేసిన సేవలు ఇప్పటికీ గుర్తున్నాయి. ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితిలో నేనున్నానంటూ సాయం చేశాడు. పింఛను ఇవ్వడంతో పాటు మాస్కులు, నిత్యావసర సరుకులు ఇంటికి చేర్చి సేవలు చేశాడు. అతడి సేవలు మరిచిపోలేను.

– గుండ్లూరు సరోజమ్మ, చిన్నజొన్నవరం రాజుపాళెం మండలం

జగనన్న సురక్షతో ప్రజలకు ఉపయోగం



ప్రొద్దుటూరు : రేషన్ కార్డు ఇస్తున్న తహసీల్దార్ నజీర్ అహ్మద్



పోరుమామిళ్ల : లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ఎంతో ఉపయోగం జరిగిందని తహసీల్దార్ నజీర్ అహ్మద్ అన్నారు. మండల పరిధిలోని చౌటపల్లెలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నెల రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమాన్ని ప్రజల బాగా వినియోగించుకున్నారన్నారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకుడు మార్తల చంద్ర ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : మండలంలోని రాజాసాహెబ్‌పేట సచివాలయంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా పాల్గొని మాట్లాడారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని ప్రజల ముంగిటకు తెచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అనంతరం వారు సభలో 350 మందికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎంపీపీ–2 చెన్ను రాజశేఖర్, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, రాజాసాహెబ్‌పేట సర్పంచ్ గాజులపల్లె లక్ష్మీప్రభావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాడిపశువులపై జాగ్రత్తలు తీసుకోవాలి



లేగదూడల ప్రదర్శనను పరిశీలిస్తున్న పశువైద్యాధికారులు

కాశినాయన : పాడిపశువులపై పాడిరైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి రామారావు తెలిపారు. మంగళవారం మండలంలోని గంగనపల్లె గ్రామంలో ఉత్తమ మేలు జాతి లేగ, పెయ్యదూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున పశువులు, జీవాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువులకు జబ్బు చేసిన వెంటనే సచివాలయ పరిధిలోని పశువైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. పశు ప్రదర్శనలో 37 మంది పాడి రైతులకు బహుమతులను ప్రదానం చేయడం జరిగిందన్నారు. పెయ్యదూడలకు నట్టల నివారణ మందు తాపించడం, చెలిపోగులు వేయడం బ్రూసెల్లోసిస్ టీకాలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, పశువైద్యాధికారులు, సచివాలయాల వైద్య సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

సామాజిక మార్పులకు అనుగుణంగా సీమ నవలా సాహిత్యం



మాట్లాడుతున్న ఆచార్య కిన్నెర శ్రీదేవి

కడప కల్చరల్ : సీమ నవలా సాహిత్యం ఈ ప్రాంత సామాజిక మార్పులకు అనుగుణంగా రూపుదిద్దుకున్నదని ద్రవిడ విశ్వవిద్యాలయం తెలుగు, అనువాద అధ్యయనాల విభాగం అధ్యక్షురాలు ఆచార్య కిన్నెర శ్రీదేవి అన్నారు. యోగి వేమన విద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం మంగళవారం బ్రౌన్ శాస్త్రి సమావేశ మందిరంలో అభ్యుదయ సాహిత్యోపన్యాసాల పేరిట సదస్సు నిర్వహించింది. ప్రధాన వక్తగా విచ్చేసిన ఆచార్య కిన్నెర శ్రీదేవి, రాయలసీమ అభ్యుదయ నవలా సాహిత్యం అనే అంశంపై ప్రసంగించారు. రాయలసీమ నవలకు 150 ఏళ్ల చరిత్ర ఉందని, ఈ ప్రాంతం నుంచి 1950కి ముందు 20, 1980 తర్వా త 108 నవలలు వచ్చాయన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య నల్లపురెడ్డి ఈశ్వర్‌రెడ్డి మా ట్లాడుతూ సాహిత్యం మనిషిని ఎలా జీవించాలో, ఎలా కూడదో తెలుపుతుందన్నారు. ఉపన్యాస వ్యవస్థాపకులు, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సంజీవ మ్మ మాట్లాడుతూ అభ్యుదయ సాహితోపన్యాసాల ద్వారా సమాజంలోని సమకాలిన సమస్యలను ఎత్తి చూపడం, వాటిని ఖండించే దిశగా వచ్చిన సాహిత్యాన్ని విద్యార్థులకు చేరవేయడం ప్రధాన ఉద్దేశమన్నారు. ఆకాశవాణి పూర్వ సంచాలకులు డాక్టర్ టక్కోలు మాచిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ పాఠ్యాంశాలతో పాటు సమాజంలో జరుగుతున్న విషయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో విశిష్ఠ అతిథిగా విశ్రాంతి జిల్లా పరిశ్రమలశాఖ అధికారి గోపాల్ పాల్గొని ప్రసంగించారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా పుల్లూరు శాఖ, ఖాజీపేట (మం)

బంగారు నగల బహిరంగ వేలం ప్రకటన

10-08-2023వ తేది గురువారం మధ్యాహ్నం 3.00 గం.లకు బహిరంగ వేలము వేయడం జరుగుతుంది.

S. No	అకౌంట్ నెంబరు	అప్పుదారుని పేరు చిరునామా	నగల బరువు	అవుట్ స్టాండింగ్ + వడ్డీ
1	572377610014297	షేక్ నిజాముద్దీన్, తండ్రి చాంద్ బాషా, టీచర్స్ కాలని, ఖాజీపేట.	74.00	2,30,562/- + వడ్డీ
2	572377610011784	షేక్ నిజాముద్దీన్, తండ్రి చాంద్ బాషా, టీచర్స్ కాలని, ఖాజీపేట.	64.80	1,75,234/- + వడ్డీ

ప్రదేశం : పుల్లూరు శాఖ
తేది: 25-07-2023

సం./- బ్రాంచ్ మేనేజర్
బ్యాంక్ ఆఫ్ ఇండియా, పుల్లూరు శాఖ